# మరమ్మతులపై పట్టింపేదీ..?

- డ్రైనేజీ నిర్మాణానికి సీసీ రోడ్డు తవ్వకం
- పనులు పూర్తయిన పూడ్చని వైనం
- మూడు నెలలుగా మురుగుతో దుర్వాసన
- ఇంటి నుంచి బయటికి అడుగు పెట్టలేని దుస్థితి
- ఈగలు.. దోమలతో ప్రజల ఇబ్బందులు..
- పట్టించుకోని అధికారులు







ఇందిరానగర్ కాలనీలో వీధుల వెంట పారుతున్న మురుగునీరు

కుషాయిగూడ: అభివృద్ధి పనులు ఆ కాలనీవాసులకు శాపంగా మారాయి. పనుల పేరుతో రోడ్డు తవ్విన అధికారులు తిరిగి పూడ్చివేయకపోవడంతో మూడు నెలలుగా స్థానికులు మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకైన రోడ్డు మధ్యలో సీసీ రోడ్డు వ్యర్థాలతో ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. మరోవైపు దుర్వాసన, ఈగలు, దోమలతో నరకయాతన అనుభవిస్తున్నామంటూ మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, ఇందిరానగర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మూడు నెలల క్రితం..**

ఇందిరానగర్ కట్ట మైసమ్మ ఆలయం పక్కవీధిలో డ్రైనేజీ నిర్మాణానికి రోడ్డును తవ్వారు. పనులు చేసే క్రమంలో పాత డ్రైనేజీ పైప్‌లైన్ కాస్తా ధ్వంసమైంది. అయితే పనులు పూర్తి చేసిన కాంట్రాక్టరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. అంతేగాకుండా పనులు పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా కొత్త డ్రైనేజీ లేన్‌కు కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో కొత్త లేన్ నిరుపయోగంగా మారడంతో పాటుగా ధ్వంసమైన పాత డ్రైనేజీ లేన్ లీకేజీల మయంగా మారింది. దీంతో వీధులన్ని మురుగు నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతున్నది. రోడ్డు మధ్యలో సిమెంట్ వ్యర్థాలతో బైక్‌లు కూడ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వారం కిత్రం వీధిలో గుండెనొప్పి వచ్చిన ఓ వ్యక్తిని తరలించేందుకు అంబులెన్స్ కూడ రాలేని దుస్థితి ఏర్పడింది. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

### అధికారులు పట్టించుకోవడం లేదు..



ప్రజా సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు. మురుగు సమస్యపై వాటర్ వర్క్స్ ఏఈ వేణుగోపాల్‌తో పాటు మేనేజర్ సతీశ్‌కు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. మూడు నెలలుగా మురుగునీటితో సహవాసం చేస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలి.

-నరేశ్ కాలనీవాసి

### సమస్యను త్వరగా పరిష్కరించాలి..



మూడు నెలలుగా మురుగు నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. దుర్వాసనతో ఇండ్లలో ఉండలేని పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మురుగు సమస్యకు పరిష్కారం చూపాలి.

-జ్యోతి కాలనీ మహిళ

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



డ్రైవర్లతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

ఉప్పల్: ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాల వాడకానికి దూరంగా ఉంటూ కుటుంబానికి దగ్గరవ్వాలని మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ చక్రపాణి అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో చౌరస్తాలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై వివిధ విభాగాల డ్రైవర్లకు మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితంతో పాటు నమ్ముకున్న వారిని నాశనం చేస్తుందన్నారు. నేటి ఆధునిక యుగంలో అన్ని రకాల మాదక ద్రవ్యాలు అందుబాటులో ఉండటం ఆందోళనకరమని వాటికి బానిసైన వ్యక్తులు చిన్న చిన్న గొడవలను పెద్దగా చేసి తారా స్థాయికి చేరే వరకు తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు వాటి బారిన పడుకుండా కాపాడుకోవాలని సూచించారు. రోడ్డుపైకి వచ్చిన ప్రతి వాహన దారుడు విధిగా వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడప వద్దని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం డ్రైవర్లతో మాదక ద్రవ్యాలను వినియోగించబోమని ట్రాఫిక్ పోలీసులు, డ్రైవర్లు తదితరులతో ఏసీపీ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు జి. లక్ష్మీ మాధవి, సూర్యానాయక్, ఎస్‌ఐలు చిరంజీవి, ఆటో, క్యాబ్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రుణాలు



రుణమేళాలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: అర్హులైన చిరువ్యాపారులు, మహిళలకు రుణాలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం మల్కాజిగిరి చౌరస్తాలోని ఇందిరాభవన్‌లో స్టేట్ బ్యాంక్ ఇండియా ఆధ్వర్యంలో రుణమేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముద్రలోన్, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం, ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకాల్లో అర్హులకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంక్ ప్రతినిధులు హరినాథ్, డేవిడ్‌లు రుణమేళాకు హాజరైన వారికి రుణాలకు ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి, ఏఏ పత్రాలు జతచేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారికి బ్యాంక్ ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అజయ్, ఆర్‌పీలు బాలత్రిపుర సుందరి, సరిత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలి



వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ఎస్ఎఫ్ నాయకులు

అల్వాల్: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల దోపిడీని అరికట్టాలని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ నేతలు అన్నారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయాన్ని ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షుడు కె.అశోక్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు, అకాడమీల పేరుతో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. ఇంటర్ విద్యకే రూ.లక్ష చెల్లించాల్సి వస్తుందని, ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ కళాశాలలో మౌలిక సదుపాయాలు లేని కారణంగానే తల్లిదండ్రులు ప్రైవేట్ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. పలు శిక్షణల పేరుతో అకాడమీలు, కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారని, ఇలాంటి వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద్, నాయకులు సురేష్‌గుప్తా, హరికృష్ణ, గణేష్, పృథ్వీ చౌహాన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ గూటికి కార్పొరేటర్ శాలిని శ్రీకాంత్ గౌడ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. పీర్జాదిగూడ మున్సిపల్ 18వ డివిజన్ కార్పొరేటర్ కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్ బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి డిప్యూటి మేయర్ కుర్ర శివకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి,వేముల మహేష్ గౌడ్,కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాలు కల్పించాలి



అల్వాల్: మొహర్రం సందర్భంగా వెంకటాపురంలోని బొరాని కమ్యూనిటీహాల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు, మైనార్టీ నాయకులు బుధవారం జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కిషోర్, మోసిన్, తాజుద్దీన్, ప్రభాకర్, శ్రీనివాస్, అమర్, మృతుంజ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### జితేందర్‌రెడ్డికి అభినందనలు



కుషాయిగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌రెడ్డిని బుధవారం ఐఎన్‌టీయూసీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత ఐలేని జయరాం రెడ్డి ఢిల్లీలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి సత్కరించారు. ఆయనతో పాటుగా కాంగ్రెస్ నేత ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

### నాచారం మహంకాళి దేవాలయ చైర్మన్‌గా కృష్ణారెడ్డి

మల్లాపూర్: దేవాదాయ శాఖ పరిధిలోని నాచారం మహంకాళి సహిత మహాకాళేశ్వర స్వామి దేవాలయ నూతన ట్రస్ట్ బోర్డు పాలక వర్గం బుధవారం కొలువుతీరింది. చైర్మన్, కమిటీ సభ్యులతో ఈఓ రమా దేవి ప్రమాణ స్వీకారం చేయించారు. దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా గుంటుక కృష్ణారెడ్డి, బోర్డు సభ్యులుగా కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, కొప్పోజి ప్రవీణ్, పూర్ణిమ, మేడాల ప్రేమ్‌కుమార్, వర్కాల మహేష్, కాసుల రమేష్ కుమార్ గౌడ్, వేదాంతం నర్సింహ మూర్తి ఎన్నికయ్యారు. అనంతరం నూతన పాలక వర్గాన్ని స్థానిక నేతలు సత్కరించారు.

### త్వరలో అల్వాల్‌లో సబ్ రిజిస్టార్ కార్యాలయం

అల్వాల్: అల్వాల్‌లో త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకానున్నట్లు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జనవరి 31న తాను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్‌లను కలిసి వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి త్వరలో అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఉపాధి హక్కుల సాధనకు పోరాటం




ర్యాలీలో పాల్గొన్న ఏఐవైఎఫ్ నేతలు

బోడుప్పల్: విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకు నిరంతర పోరాటం కొనసాగిస్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. బుధవారం బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన ఏఐవైఎఫ్ మేడిపల్లి మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలన్నారు. యువతరంలో ప్రగతి శీల, అభ్యుదయ భావాలను, దేశభక్తి, నైతిక విలువలు, మానవత్వాన్ని పెంపొందించేందుకు ఏఐవైఎఫ్ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఇందిరానగర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్యప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్, నేతలు దండు రమేష్, నాగరాజు, మణిదీప్, కౌశిక్, సాత్విక్, కార్తీన్, సంజయ్ పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక**

ఏఐవైఎఫ్ మేడిపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మణిదీప్, కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా దినేష్, ఇషాక్, కోశాధికారిగా ఖాదర్, సహాయ కార్యదర్శులుగా కౌశిక్, ఏడు కొండలు, కౌన్సిల్ సభ్యులుగా సాత్విక్, కార్తీక్, సాయి రాజ్, భాస్కర్, ఒమర్, భాను, ప్రణయ్, ఉదయ్‌కుమార్, అజయ్, వాసు, దినేష్ ఎన్నికయ్యారు.

## మురుగు నీటి సమస్యను పరిష్కరించండి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ రామాలయం సమీపంలో మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నట్లు కాలనీ వాసుల నుంచి ఫిర్యాదు అందడంతో బుధవారం కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించాలని, పెద్ద డయా పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని, తాత్కాలిక పరిష్కారంగా ప్రస్తుతం ఉన్న పైపులైన్‌ను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ మల్లిఖార్జున్, ఏఈ లక్ష్మీ, మల్లేష్‌గౌడ్, షర్నగిరి, అరుణ్, అంజయ్య, మహేష్, ఇమ్రాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

**రామ్‌నగర్ కాలనీలో పనుల పరిశీలన**

అల్వాల్: అల్వాల్ రామ్‌నగర్‌కాలనీ పంజాబ్ కమ్యూనిటీ హాల్ వద్ద మంచినీటి లీకేజీ సమస్యను తొలగించేందుకు చేపట్టిన పనులను మంగళవారం రాత్రి పనులను కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌గౌడ్, కన్నాగౌడ్, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

## సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



నేరేడ్‌మెట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్‌లోని ఆర్‌కెపురం ఫ్లైఓవర్ మరమ్మతులు, సమాంతర ఫ్లై ఓవర్ నిర్మాణానికి రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైల్వే అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వీలైనంత త్వరగా సమాంతర ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారి సుధాకర్, జీహెచ్ఎంసీ ఈఈ రాజు, డీఈ రేణుక, కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జెకె.హన్మంతరావు, రావుల అంజయ్య, చిందం శ్రీనివాస్, మేకల రాముయాదవ్, జీఏసీ వెంకన్న, శోభారాణి, రమాదేవి, శ్యామ్, పాపిరెడ్డి, సర్వేష్‌యాదవ్, సాయి, శివ, బాలకృష్ణ, శంకర్‌రావు, నరేష్, రాజేష్, రవీంద్ర, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విధులకు డుమ్మా

## బస్తీ దవాఖానాలో కానరాని డాక్టర్, సిబ్బంది





ప్రాథమిక ఆరోగ్య అధికారితో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**కార్పొరేటర్ తనిఖీలో వెలుగులోకి**

- ఈనెల 4వ తేదీ నుంచి డాక్టర్, సిబ్బంది గైర్హాజరు
- డీఎంహెచ్‌ఓకు ఫోన్ చేస్తే దవాఖానాను మూసేస్తామని బదులిచ్చిన వైనం
- డీఎంహెచ్‌ఓ నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేస్తామన్న కార్పొరేటర్

మల్కాజిగిరి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బస్తీ దవాఖానాలు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అబాసుపాలవుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో మొదటగా బీజేఆర్‌నగర్‌లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం బస్తీ దవాఖానా ఏర్పాటు చేసింది. ఆ ప్రాంతంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఉండటంతో అనతికాలంలోనే బస్తీ దవాఖానాకు మంచి స్పందన వచ్చింది. ప్రజల పెద్ద సంఖ్యలో ఇక్కడ వైద్య సేవలు పొందేవారు. ఇటీవల డాక్టర్లు, సిబ్బంది తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కార్పొరేటర్ అకస్మిక తనిఖీతో...**

కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ బుధవారం బస్తీ దవాఖానాను అకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ కష్యప్, స్టాఫ్‌నర్సు ఎస్.జ్యోతి రాలేదు. హాజరు పట్టీని పరిశీలిస్తే 4వ తేదీ నుంచి గైర్హాజరు అయినట్లుగా గుర్తించారు. వెంటనే డీఎంహెచ్‌ఓ రఘునాథస్వామితో ఫోన్‌లో మాట్లాడితే ఆయన పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. బస్తీ దవాఖానాను పర్యవేక్షించే మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య అధికారి డా. కఫూర్ లాంగ్‌లీవ్‌లో ఉన్నారని చెప్పడంతో కార్పొరేటర్ ఆసహనం వ్యక్తం చేశారు. కుషాయిగూడ పీహెచ్‌సీలో డాక్టర్ పనిచేస్తున్నాడని కార్పొరేటర్ చెప్పడంతో ఆమె సమాధానం చెప్పలేకపోయింది.

**బస్తీ దవాఖానాను తీసేస్తే ఎక్కడికి పోతారు..**

కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానా డాక్టర్, సిబ్బందిపై స్థానికులు పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇదే విషయంపై డీఎంహెచ్‌ఓతో మాట్లాడితే స్థానికంగా సమస్యలు ఉన్నాయని.. బస్తీ దవాఖానా మూసేస్తామని సమాధానం చెబుతున్నారని తెలిపారు. ఇక్కడి నుంచి బస్తీ దవాఖానాను తీసేస్తే ప్రజలు ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. డీఎంహెచ్‌ఓపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే ఈ విషయాన్ని వైద్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

### దవాఖానా మహిళా సిబ్బందికి వేధింపులు.. కేసు నమోదు

బస్తీ దవాఖానాలో డబ్బులు తీసుకొని ఓ మహిళకు దాసరి శ్యామ్ అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పించారు. ఆ తర్వాత ఆమెను మానసికంగా, శారీరిరకంగా వేధిస్తున్నాడు. శ్యామ్ ఓ పార్టీ నాయకుడిగా స్థానికంగా చలామణి కావడం గమనార్హం. వేధింపులు ఎక్కువ కావడంతో సదరు మహిళ మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

## నమ్మకంగా ఉంటూనే..

- యజమాని హత్య
- నిందితుడి అరెస్ట్

అల్వాల్: యజమాని వద్ద నమ్మకంగా పనిచేస్తూనే పెద్దమొత్తంలో డబ్బులు కాజేయాలన్న ఆశతో అతడిని హత్య చేసి తనకేమీ తెలియదన్నట్లు మృతుడి కుటుంబసభ్యులతో కలిసి తిరుగుతున్న నిందితుడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకొని జైలకు పంపారు..పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన అన్వర్ మీర్జా (33) నగరానికి వలస వచ్చి ఇందిరానగర్‌లో ఉంటూ క్యాటరింగ్ పని చేస్తున్నాడు. అతడి వద్ద హరిద్వార్‌కు చెందిన మనోజ్ రాయల్ నమ్మకంగా పని చేసేవాడు. మే 13న అన్వర్ మిర్జా కుటుంబసభ్యులు మధ్యప్రదేశ్‌కి వెళ్లగా, అన్వర్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. 17న ఇంట్లో అతను అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అతడి వద్ద పని చేస్తున్న మనోజ్ రాయల్ హత్య చేసినట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

**మద్యం తాగించి..**

యజమాని వద్ద రూ.2 లక్షల నగదు బ్యాంకులో ఉన్నట్లు తెలుసుకున్న మనోజ్ అతడిని హత్య చేసి డబ్బులు కాజేయాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం గత నెల 17న రాత్రి అన్వర్ మిర్జాకు ఫుల్లుగా మద్యం తాగించాడు. మద్యం మత్తులో ఉన్న అతడి తలపై కొట్టి హత్య చేసి ఏటీఎం కార్డు, సెల్‌ఫోన్, బైక్ తీసుకుని పారిపోయాడు. అన్వర్ ఇంటినుంచి దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు అల్వాల్ పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతుడి బ్యాంకు ఖాతా నుంచి నగ దు డ్రా కావడంతో పాటు ఫోన్ డాటా ఆధా రంగా మనోజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

### గృహనిర్మాణ వ్యర్థాలు రోడ్డుపై వేస్తున్న వాహనాలు సీజ్



బహుమతి అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్ అంజనేయులు

ఉప్పల్: ఇంటి వ్యర్థాలను రోడ్డు పక్కన పారబోస్తే భారీగా జరిమానా విధిస్తామని ఉప్పల్ డిప్యూటి కమిషనర్ ఆంజనేయులు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం గృహ నిర్మాణ వ్యర్థాలను రోడ్డుపై వేస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేశారు. గృహ నిర్మాణ వ్యర్థాలను రోడ్డుపై పడేసిన వారిని గుర్తించి సమాచారం అందిస్తే రూ.1000 వరకు నజరానా అందిస్తున్నట్లు ప్రకటించారు. అలాంటి వారిపై కాలనీ అసోసియేషన్లు, వెల్ఫేర్ అసోసియేషన్లు కన్నేసి ఉంచి తమకు సమాచారం అందించాల్సిందిగా కోరారు. గృహ నిర్మాణ వ్యర్థాలు పడేసే వారికి రూ. 25 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. ఈ విషయంపై అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి వివరించినట్లు తెలిపారు. ఇప్పటికే గృహ నిర్మాణ వ్యర్థాలను పడవేసే వారిని పట్టుకుని ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. సమాచారం అందజేసిన వ్యక్తికి రూ. 1000 నజరానా అందజేశామన్నారు. స్వచ్ఛ ఉప్పల్ సాధనకు ప్రతి ఒక్కరు సహకారాలు అందించాలని కమిషనర్ కోరారు.

### సాహూ మహరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



మల్లాపూర్: రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. బుధవారం నాచారంలో ఛత్రపతి మహారాజ్ 150 జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంద ప్రభాకర్ సాహూ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం బహుజన సమాజ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అట్టడుగు వర్గాల బడుగు బలహీన వర్గాలకు స్వేచ్ఛ స్వాతంత్ర హక్కులు కల్పించిన మొట్టమొదటి వ్యక్తి సాహూ మహరాజ్ అని కొనియడారు. కార్య క్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ భానోత్ రవీందర్‌నాయక జిల్లా ఇన్‌చార్జి గౌడ సుదర్శన్, జిల్లా అధ్యక్షులు అంబేద్కర్, ఉపాధ్యక్షులు మల్లేష్, ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షులు శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి మింద్రాల నర్సింగ్‌రావు, జంగయ్య,గౌతమ్‌రాజు. యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

### విద్యా సంస్థల బంద్ విజయవంతం



స్కూళ్లను మూసివేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

రామంతాపూర్: ప్రైవేట్ కార్పొరేటర్ విద్యా సంస్థల అధిక ఫీజు వసూళ్లను నిరసిస్తూ ఫీజు నియంత్రణ చట్టాన్ని తేవాలని, ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిల భారత విద్యార్థి పరిషత్ బంద్ పిలుపు మేరకు రామంతాపూర్‌లోని పలు ప్రభుత్వ ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు పూర్తిగా మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ఏబీవీపీ కన్వీనర్ బుర్ర అఖిల్, నగర కార్యదర్శి లోకేష్ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్‌లు విచ్చల విడిగా ప్రతి సంవత్సరం ఫీజులు పెంచుకుంటూ పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని తేవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నవీన్, సంతోష్, యశ్వంత్, నిఖిల్, శివ సాయి, వేణు పాల్గొన్నారు.

### డ్రగ్స్‌ను నిర్మూలించాలి

కుషాయిగూడ: రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న డ్రగ్స్ వినియోగాన్ని నిర్మూలించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, రాథోడ్ సంతోష్ అన్నారు. డ్రగ్స్ వద్దు.. జీవితమే ముద్దు అనే నినాదంతో ఈసీఐఎల్ చౌరస్తాలో బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నగరాల్లో ఉండే ఈ విష సంస్కృతి, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం దురదృష్టకరమన్నారు. సినీ, సాఫ్ట్‌వేర్, విద్యా పలు రంగాలకు చెందిన యువత డ్రగ్స్ వినియోగిస్తున్నారన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్నారు.

### డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన

అల్వాల్: మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనం అవుతాయని, భవిష్యత్తు అంధకారమవుతుందని నేరేడ్‌మెట్ పోలీసులు అన్నారు. బుధవారం నేరేడ్‌మెట్ పోలీసులు, హెలెన్ కెల్లర్ విద్యా సంస్థ విద్యార్థులతో కలిసి నేరేడ్‌మెట్ శ్రీకాలనీ నుంచి చౌరస్తా వరకు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై ప్లకార్డులు ప్రదర్శించారు.

### డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

రామంతాపూర్: రామంతాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఉప్పల్ సర్కిల్ జల మండలి జీఎం సంతోష్ కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డిలను కలిసి సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా కేసీఆర్‌నగర్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ సమస్య, తాగునీటి ఎద్దడి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా సమస్య లను 15 రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించా రు.

### ఎమ్మెల్యేకు బీసీ నేతల పరామర్శ

అల్వాల్: సతీవియోగంతో బాధపడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నేతలు అల్వాల్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో విక్రమ్‌గౌడ్, కుందారం గణేషచారి, కుల్కచర్ల శ్రీనివాస్, మహేష్ ప్రవీణ్‌కుమార్, పానుగంటి విజయ్, ఇంద్రం రజక, గౌతమ్, ప్రజాపతి, అర్జున్, సురేష్ తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 | 9912220571
9912225470 | 9505507657